సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 15 | ఆగస్టు | 2025



వీక్లీ రైళ్ల సర్వీసులు పొడిగింపు
వరంగల్ మీదుగా నడుస్తున్న పలు రైళ్ల సర్వీస్‌లను పొడిగించి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్ గురువారం తెలిపారు. - IIలో▸



త్రికూటాలయాలు అద్భుతం
కాకతీయుల త్రికూటలయాల నిర్మాణాలు అద్భుత శిల్పకళావైభవానికి నిదర్శనమని ప్రొఫెసర్ మనోహర్ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
28⁰/23⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఈఓ జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలి



విద్యారణ్యపురి: వరంగల్ విద్యాశాఖ సమగ్ర శిక్ష జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సుజన్‌తేజపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు గురువారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈనెల 12న ఎంఈఓలతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో అకడమిక్ విషయాలపై సుజన్‌తేజ మాట్లాడుతుండగా జ్ఞానేశ్వర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్, టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్, టీపీటీఎఫ్, టీపీయూఎస్, ఎస్‌సీఎస్‌టీ యూఎస్ బాధ్యులు ఎస్.రవీందర్, తాటికాయల కుమార్, సి.సుజన్‌ప్రసాద్ రావు, నామోజు శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరావు, కడారి భోగేశ్వర్, బి.వెంకటరమణ, ఎస్.వెంకన్న, ఎం.నర్సయ్య, గుండు కరుణాకర్, ఎస్‌ఏ రవూఫ్, కె.రవీందర్, వి.అరవింద్, కె.కుమారస్వామి ఉన్నారు.

పీఏసీఎస్, డీసీసీబీల కాల పరిమితి పెంపు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీల పాలకవర్గాల కాలపరిమితిని ప్రభుత్వం పొడిగించింది. 2025 ఫిబ్రవరి 14 నాటికి ఐదేళ్ల కాలపరిమితి ముగియగా.. ఆరు నెలలు పెంచింది. ఈ గడువు కూడా గురువారంతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈమేరకు ఏపీసీ అండ్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఎం.రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ డీసీసీబీ ప్రస్తుత పాలక వర్గం కాల పరిమితి ఈ నెల 24తో ముగియనుంది. దీంతో ప్రస్తుత పాలక వర్గంలో మరో ఆరు నెలల పాటు కొనసాగనుంది. ఈసందర్భంగా తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ఈనెల 15న వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేయనున్నట్లు తెలిపారు.

లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ



హన్మకొండ: హనుమకొండ సమ్మయ్యనగర్‌లోని లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ తనిఖీ చేశారు. ప్రతీ రోజు ఎంత మంది రోగులు వస్తున్నారో రికార్డులు పరిశీలించారు. ఈహెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసిన వివరాలను పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హైదర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హైదర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి, ఇంటర్ చదివి జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 15న స్వాతంత్య్ర వేడుకల్లో నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. ప్రతీ జిల్లా నుంచి పదో తరగతిలో ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు, ఇంటర్‌లో ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు అందించనున్నారు. వీరికి హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో నగదు, ప్రశంసపత్రాలు అందించనున్నారు.

రేపు జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 16న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అండర్–15 బాలబాలికల జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు జనవరి 01, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వెంట ఆధార్, బోనోఫైడ్ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలకు వాలీబాల్ గ్రౌండ్ వద్ద కన్వీనర్ రాముడుకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన జట్టు ఈనెల 18, 19 తేదీల్లో సరూర్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.



'దేశంలో అందరూ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అవినీతి. దీనిని రూపుమాపినప్పుడే సమాజం బాగుపడుతుంది. బీద, ధనిక తేడాలు, అధికార దర్పం తదితర కారణాలతో స్వేచ్ఛాసమానత్వం ప్రజలందరికీ అందడం లేదు. మనం ఎన్నుకునే ప్రజాప్రతినిధులు, కొలువుదీరే చట్టసభలు న్యాయంగా పనిచేస్తేనే నాడు ఏ ఉద్దేశంతో అయితే బ్రిటిష్ వాళ్ల నుంచి స్వాతంత్య్రం పొందామో ఆ ఫలితాలు తారతమ్యాలు లేకుండా అందరికీ చేరుతాయి.' అని ఉమ్మడి వరంగల్ జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో పలు అంశాలపై 'సాక్షి' ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా ప్రజలు తమ మెజారిటీ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. - సాక్షి నెట్‌వర్క్


అవినీతి రహితం.. సమాజ హితం


సాక్షి సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లావాసుల మనోగతం


- దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యే అవినీతి
- అందరి దరికి చేరని స్వేచ్ఛా సమానత్వం
- చట్టసభలు పనిచేస్తేనే ప్రజలకు స్వాతంత్య్ర ఫలాలు
- నాణ్యమైన విద్య, వైద్యం అందాల్సిన అవసరం ఉంది..

శాంపిల్స్ : ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలనుంచి 30 మంది చొప్పున 180 మంది. ఇందులో 90 మంది మహిళలు, 90 మంది పురుషులు









మార్పు రావాలి.. భారత్ మెరవాలి

ప్రపంచంలోనే దేశం అగ్రగామిగా నిలుస్తుంది..
- పాలకుల విధానాలు మారాల్సిన అవసరం ఉంది
- అభిప్రాయాలు వ్యక్తం చేసిన 'నలంద' విద్యార్థులు
- 'వందేళ్ల భారత్ ఎలా ఉండాలి' అనే అంశంపై 'సాక్షి' టాక్‌షో

'మనది ఎప్పుడూ అభివృద్ధి చెందుతున్న దేశమే. మారుతున్న ఆధునిక టెక్నాలజీని అందుకుని ఇంకా మార్పు రావాలి.. అప్పుడే భారత్ మెరుస్తుంది' అని విద్యార్థులు అంటున్నారు. నేడు (శుక్రవారం) స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా '2047కు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత్ ఎలా ఉండాలి'? అనే అంశంపై, ఉచిత పథకాలు, పాలకుల విధానం, విద్య, వైద్యం, ఆరోగ్య రంగం అంశాలపై మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం 'సాక్షి' టాక్‌షో నిర్వహించింది. ఇందులో విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. - మహబూబాబాద్ అర్బన్

సాక్షి టాక్ షో





'సాక్షి' టాక్‌షోకు హాజరైన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ దోలి సత్యనారాయణ

ప్రజల స్థితిగతులు మారట్లేదు..



దేశంలో ప్రజలు భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా బాలికల, మహిళలు హక్కులు తెలుసుకోవాలి. స్వేచ్ఛ, సమానత్వం సాధించుకోవాలి. నేటికీ మహిళలు, చిన్నారులు, యువతులపై దాడులు కొనసాగుతున్నాయి. శిక్షలు కఠినంగా ఉంటేనే ప్రజలు క్రమశిక్షణతో జీవిస్తారు. నేటి విద్యార్థులు, యువతరం ప్రభుత్వాలను ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం.
- కె.చందన, బీఎస్సీ, తృతీయ సంవత్సరం

పర్యావరణ రక్షణకు తోడ్పడాలి..



దేశాభివృద్ధి పేరిట అడవులను నరికేస్తున్నారు. మానవ వనరులను కొంత మంది దోచుకుంటున్నారు. భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం అందించేందుకు అడుగు ముందుకు పడాలి. ప్రభుత్వాలు సైతం ప్రజలకు సహకరిస్తూ దేశంలోని అటవీ సంపదను సంరక్షించాల్సిన అవసరం ఉంది. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.
- కోడి మానస, బీఎస్సీ తృతీయ సంవత్సరం

నిధులను అభివృద్ధికి ఉపయోగించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నాయి. ఇందులో కొన్ని ప్రజలకు ఉపయోగం లేనివి ఉన్నాయి. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయి. వాటిని సక్రమంగా పేద, మధ్య తరగతి వారికి, చిరువ్యాపారులకు అందిస్తే దేశం ఆర్థిక పురోగతి సాధిస్తుంది. మిగిలిన నిధులను రైతులకు, పాఠశాలలకు, గ్రామాలకు, తండాల అభివృద్ధికి ఉపయోగించాలి.
- హర్షవర్ధన్, బీఎస్సీ, ఫస్ట్ ఇయర్

అభివృద్ధిలో యువతే కీలకం



గ్రామస్థాయిలో పేదలకు విద్య, వైద్యం అందినప్పుడు దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తే అప్పుడు దేశం అభివృద్ధి సాధిస్తుంది. చిన్న చిన్న దేశాల్లో విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతోనే ఆయా దేశాలు నేడు అన్ని రంగాల్లో ముందుంటున్నాయి. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడపడంలో యువతదే కీలక పాత్ర.
- సామియా షెహరీన్, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం

దేశం అభివృద్ధి చెందాలంటే..



దేశాభివృద్ధికి ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చాయి. ఇవి గ్రామీణ పేదలకు పూర్తి స్థాయిలో అందట్లేదు. దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామస్థాయిలో ప్రజలు, రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను నిర్మూలించాలి. పర్యావరణ రక్షణకు ప్రభుత్వాలు సంసిద్ధమై చర్యలు చేపట్టాలి.
- దోలి సత్యనారాయణ, నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్

పేదల స్థితిగతులు మారలేదు..



దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది రాజకీయ నాయకులు పదవులు అధిష్టించారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో పేదల స్థితిగతులు మారలేదు. స్వార్థ రాజకీయాలతో ప్రజలు అభివృద్ధిలో భాగస్వామ్యం కాలేకపోతున్నారు. విద్య, వైద్యం, ఆర్థిక వ్యవస్థ, మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడితే వందేళ్ల భారత్‌లో భావితరం ఆర్థికంగా పురోగతి సాధిస్తుంది.
- కోట సుధాకర్, పోస్టల్ అధికారి

ఇప్పటికీ పేదరికంలోనే..



దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా.. బీదలు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు. రాజకీయ నేతలు అభివృద్ధి అని అంటున్నారే తప్ప అంతర్గతంగా గ్రామాలు, మారుమూల తండాలకు కనీస సౌకర్యాలు కల్పించట్లేదు. ఆడపిల్లలకు సమాన హక్కులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. రాజకీయ నాయకులు, ప్రజలకు నిజమైన సేవలందిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.
- ఎండీ. సానియామీర్, బీఎస్సీ మూడో సంవత్సరం

నాయకుల్లో మార్పు రావాలి..



భారత్‌కు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చాలా చిన్న దేశాలకు స్వాతంత్య్రం వచ్చి అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాయి. కానీ, 150 కోట్లకుపైగా జనాభా ఉన్న భారతదేశం మాత్రం అభివృద్ధిలో వెనుకంజలో ఉంది. దీనికి ప్రధాన కారణం రాజకీయ నాయకులు. కొంతమంది ధనార్జనే ధ్యేయంగా ఆస్తులు సంపాదిస్తున్నారు. ముందుగా రాజకీయ నాయకులు మారితేనే దేశం మారుతుంది.
- గోగు రమేశ్, బీకాం మూడో సంవత్సరం

సమరయోధుల త్యాగాలతోనే స్వేచ్ఛ



అనేక మంది సమరయోధుల పోరాటాలతోనే దేశానికి స్వాతంత్య్రం వచ్చింది. ఇన్నేళ్లు గడిచినా దేశంలో ఎక్కడి ప్రజలు అక్కడే ఉన్నారు. పేదలను పట్టించుకోనే నాథుడే లేడు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా నేటితరం విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దేశానికి తమవంతు సహాయం అందించేలా బాధ్యత తీసుకుంటేనే భవిష్యత్‌లో దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుంది.
- జాహ్నవి, బీకాం, ద్వితీయ సంవత్సరం

యువతతోనే దేశాభివృద్ధి



రాజకీయ నాయకులకు అక్రమ సంపాదనపై ఉన్న మక్కువ దేశాభివృద్ధిపై లేదు. స్వార్థపు ఆలోచనలతోనే బతుకుతున్నారు. ఎవరు ఎటుపోతే నాకేంటి? అనుకుంటున్నారు. తోటి మిత్రులకు, పేదలకు, ఇతరులకు సాయం అందించినప్పుడు దేశం ఆర్థికంగా ముందుకు వెళ్తుంది. పదిమంది చేసే పనిని ఒక ఏఐ చేస్తే మిగతావారి పొట్టకొట్టినట్లే కదా. ఏఐతో మానవ మనుగడకు ముప్పే.
- ఎస్‌కే అన్వర్, బీఏ, తృతీయ సంవత్సరం

నవ చైతన్యానికి విద్య పునాది



ఆనాటి పోరాట యోధులు తెల్లదొరల తుపాకీ గుండ్లకు ఎదురు నిలబడి, ప్రాణత్యాగాలు చేసి భారత్‌కు స్వాతంత్య్రం తీసుకొచ్చారు. నవ చైతన్యానికి విద్య పునాది అని అంబేడ్కర్ చెప్పినట్లుగా యువకులు ఉన్నత చదువులు చదివి దేశానికి ఆదర్శంగా నిలవాలి. ప్రభుత్వాలు ఉచిత పథకాలు ఆపేసి ఉచిత విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి.
- మహంకాళి వరుణ్, బీకాం తృతీయ సంవత్సరం

నిర్మానుష్య ప్రదేశాలపై నిఘా పెట్టండి

- మత్తు పదార్థాల రహిత సమాజమే లక్ష్యం : సీపీ సన్‌ప్రీత్ సింగ్



సమీక్షిస్తున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

కేయూ క్యాంపస్: 'మత్తు పదార్థాల నియంత్రణకు విద్యాసంస్థల పరిసరాలతో పాటు నిర్మానుష్య ప్రదేశాలపై నిఘా పెట్టండి' అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులతో అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనాభవనం సెనేట్ హాల్‌లో గురువారం పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్షలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల నిరోధానికి పోలీస్ అధికారులు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణకు వివిధ చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా మద్యం దుకాణాల యజమానుల్ని ఆదేశించాలన్నారు. పోలీసు సిబ్బంది యోగక్షేమాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కాగా, సన్‌ప్రీత్‌సింగ్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి పోలీస్ అధికారులతో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షించారు. కేసుల పరిష్కారానికి పలు సూచనలిచ్చారు. సమావేశంలో డీసీపీలు షేక్‌సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏఎస్పీలు శుభం, చేతన్ నితిన్, అదనపు డీసీపీలు ప్రభాకర్, రవి ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆరోగ్య జిల్లాలుగా మార్చాలి

- సీజనల్ వ్యాధుల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి



వరంగల్ సమీక్షలో పాల్గొన్న ప్రత్యేకాధికారి, కలెక్టర్, ఇతర అధికారులు

న్యూశాయంపేట/హన్మకొండ అర్బన్: వరంగల్, హనుమకొండ జిల్లాలను ఆరోగ్య జిల్లాలుగా మార్చేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆయన గురువారం వరంగల్, హనుమకొండ కలెక్టరేట్లలో కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్ అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. ఆయా జిల్లాల్లో తీసుకుంటున్న వ్యాధి నివారణ చర్యలను వివరించారు. సీజనల్ వ్యాధుల్ని అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి, డీపీఓలు కల్పన, లక్ష్మీ రమాకాంత్, డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, డాక్టర్లు కిషోర్, మురళి, రామ్మూర్తి, కిషన్, మోహన్‌దాస్, ప్రకాశ్, కొంరయ్య అశ్విన్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ రావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి గౌతమ్ చౌహాన్, అధికారులు పాల్గొన్నారు.



హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లు



వరంగల్ ఖుష్‌మహల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

స్వాతంత్య్ర వేడుకలకు హనుమకొండలోని పోలీస్‌పరేడ్‌గ్రౌండ్, వరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు. హనుమకొండలో మంత్రి కొండా సురేఖ, వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఉదయం 9:30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. జిల్లాల అభివృద్ధిపై ప్రసంగించి స్వాతంత్య్ర సమరయోధులు, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఉత్తమ సేవలందించిన వారిని సన్మానిస్తారు. – విద్యారణ్యపురి/ఖిలా వరంగల్

వాహనాల సమాచారం అందుబాటులో ఉండాలి

- ఐసీసీసీ ఆకస్మిక తనిఖీ
- మేయర్ సుధారాణి

రామన్నపేట: వాహనాల కదలికల సమాచారం అందుబాటులో ఉండాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఐసీసీసీ కేంద్రాన్ని మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేసి వాహన ట్రాకింగ్ నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోతన, బాలసముద్రంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో చెత్తను కొలవడానికి వేవింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాలని, శానిటేషన్ వాహనాల కదలికలకు సంబంధించి సమగ్ర సమాచారం నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీ మేనేజర్ రమేశ్, ఐసీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా హక్కుల రక్షణకే రాహుల్ పోరాటం

- హనుమకొండ, వరంగల్ డీసీసీ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వెంకట్రామ్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

హన్మకొండ/ఖిలావరంగల్: దేశ ప్రజల హక్కులను కాపాడేందుకే రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి హనుమకొండ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు, అదేవిధంగా వరంగల్ పోస్టాఫీసునుంచి హెడ్‌పోస్టాఫీసు వరకు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఓటును చోరీ చేసి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు హక్కు హరించిన బీజేపీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గళాలను బీజేపీ ప్రభుత్వం అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు బత్తిని శ్రీనివాస్‌రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్‌కుమార్, ఎంపీ ఆనంద్, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష, శ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.







విద్యుత్ దీప కాంతులతో ముస్తాబైన వరంగల్ కలెక్టరేట్

విద్యుత్ వెలుగుల్లో శిల్పాల ప్రాంగణం

ముస్తాబైన నగరం..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి నగరం ముస్తాబైంది. కాకతీయుల రాజధాని మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని కాకతీయుల కళాతోరణం, శిల్పాలు, వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట మువ్వన్నెల జెండా వెలిగిపోతున్నాయి. పర్యాటకులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లను త్రివర్ణ విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

- ఖిలవరంగల్/
సాక్షి ఫొటోగ్రాఫర్లు హన్మకొండ/వరంగల్



హనుమకొండ కలెక్టర్ కార్యాలయం

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీసీలో కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులు

హన్మకొండ అర్బన్/న్యూశాయంపేట: వాతావరణ శాఖ సూచనల మేరకు రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురిసే భారీ నుంచి అతి భారీ వర్షాల వల్ల ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్ సచివాలయం నుంచి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా నిల్వలపై సీఎస్ రామకృష్ణారావుతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారాన్ని పూర్తిస్థాయిలో తీసుకోవాలన్నారు. సమావేశంలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, కె.నారాయణ, అధికారులు, వరంగల్‌నుంచి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతంరెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతులపై అవగాహన అవసరం

రామన్నపేట: వాహన మరమ్మతులపై డ్రైవర్లకు ప్రాథమిక అవగాహన అవసరం ఉందని, మేయర్ గుండు సుధారాణి సూచించారు, గురువారం బల్దియా కార్యాలయంలో టాటా వాహన కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వాహనాలకు కనీస మరమ్మతులపై చెత్తతరలింపు వాహన డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా సుధారాణి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఎంహెచ్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ మాధవీలత, డీఈ రాజ్‌కుమార్, భాస్కర్, నరేందర్, శ్రీను, ఏఈలు పాల్గొన్నారు.

అండర్- 15, 17 ఫుట్‌బాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: సుబ్రతో ముఖర్జీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 16న అండర్-15, 17 బాలుర విభాగాల్లో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియెల్ స్కూల్ మైదానంలో నిర్వహించే ఎంపికల్లో హాజరయ్యే క్రీడాకారులు జనవరి 01, 2011, జనవరి 01, 2009ల తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన జట్లు ఈనెల 20, 21 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

త్రికూటాలయాల నిర్మాణాలు అద్భుతం

- కాకతీయ వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్

విద్యారణ్యపురి : కాకతీయుల త్రికూటాలయాల నిర్మాణాలు అద్భుత శిల్పకళావైభవానికి నిదర్శనమని కాకతీయ యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మనోహర్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా 'కాకతీయ టెంపుల్స్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయుల త్రికూటాలయాలు శివకేశవుడు, సూర్యదేవ ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయన్నారు. బడంగ్‌పేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ కాకతీయుల దేవాలయాల శిల్పకళ ప్రసిద్ధిగాంచిందన్నారు. గంభీరావుపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ కాకతీయుల శిల్పకళలకు నిలయం రామప్పదేవాలయం అన్నారు. అనంతరం హనుమకొండ ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి వర్ధన్నపేట, కేడీసీ కాలేజీల ప్రిన్సిపాళ్లు పోచయ్య, జి. శ్రీనివాస్, టీహెచ్‌సీ ఫార్మర్ జనరల్ సెక్రటరీ ఎం. వీరేందర్, హెరిటేజ్ యాక్టివిస్ట్ ఆర్య, ఈవర్క్‌షాప్ కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ జి. సుహాసిని, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం. అరుణ, ఐక్యూఏసీకోఆర్డినేటర్ సురేశ్‌బాబు మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, చరిత్రకారులకు అతిథుల చేతులమీదుగా సరిఫికెట్లు అందజేశారు.

నాందేడ్-తిరుపతి వీక్లీ రైళ్ల సర్వీస్‌ల పొడిగింపు

కాజీపేట రూరల్ : వరంగల్ మీదుగా కొనసాగుతున్న నాందేడ్-తిరుపతి-నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను పొడిగించి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

రైళ్ల వివరాలు..

2026, మార్చి 28వ తేదీ వరకు హెచ్.ఎస్.నాందేడ్-తిరుపతి (07015) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం వరంగల్‌కు చేరుతుంది. అదేవిధంగా 2026, మార్చి 29వ తేదీ తిరుపతి-హెచ్.ఎస్.నాందేడ్ (07016) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం వరంగల్‌కు చేరుతుంది. 1- ఏసీ, 2- ఏసీ, 3- ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు ముద్కెడ్, బాసర, నిజామాబాద్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో అప్ అండ్ డౌన్ హాల్టింగ్ కల్పించారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకరయ్యపై ఫిర్యాదు

- ఐదుగురితోకూడిన కమిటీ నియామకం
- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శంకరయ్యపై ఇటీవల వీసీ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో వీసీ అప్రూవల్ మేరకు కమిటీని నియమిస్తూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం రెండు రోజులక్రితం ఉత్తర్వులు జారీచేశారు.ఈ కమిటీ చైర్మన్‌గా సైన్స్ విభాగాల డీన్ జి. హనుమంతు, మెంబర్లుగా సీడీసీ డీన్ పి.వరలక్ష్మి, ఫిజిక్స్‌విభాగం ప్రొఫెసర్ శ్రీలత, జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, మెంబర్ కన్వీనర్‌గా డిప్యూటీ రిజిస్ట్రార్ పి. శ్రీధర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. తెలుగు విభాగంలో శంకరయ్య 2011-2013లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇచ్చే పోస్టు డాక్టరల్ ఫెల్లోషిప్(పీడీఎఫ్) పొందారు. ఫెల్లోషిప్‌తోపాటు కాంటిజెన్సీ కూడా డ్రా చేశారని, మరోవైపు పార్ట్‌టైం లెక్చరర్‌గా కూడా విధులు నిర్వర్తిస్తూ కేయూ నుంచి రెమ్యునరేషన్ కూడా తీసుకున్నారనే ప్రధాన ఆరోపణ ఉంది. యూజీసీ నిబంధనల ప్రకారం పీడీఎఫ్ పొందుతున్నప్పుడు పార్ట్‌టైం లెక్చరర్‌గా విధులు నిర్వర్తించొద్దు. శంకరయ్య నిబంధనలకు విరుద్ధంగా పీడీఎఫ్ లబ్ధి పొందుతూనే పార్ట్‌టైం లెక్చరర్‌గా కూడా రెమ్యునరేషన్ తీసుకున్నారనే ఆరోపణలతో పలు అసోసియేషన్స్, విద్యార్థుల ఫిర్యాదు, వినతుల నేపథ్యంలో ఈ కమిటీని నియమిస్తున్నామని రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణ జరిపి పదిరోజుల్లో నివేదిక సమర్పించాలని, దీని ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్: రైతులకు ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఎరువుల గోదాంను గురువారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతులకు ఎరువులు, లిక్విడ్ రూపంలో లభించే నానో డీఏపీ, నానో యూరియా అవసరమైనంత మేర అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ముప్పారం, నారాయణగిరి గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ చైర్మన్‌కు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారికి ఫోన్ చేసి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్, వేలేరు మండలాల రైతులకు సరిపడా ఎరువులను.. గోదాం నిర్వాహకులు అడిగిన వెంటనే పంపించాలని ఆదేశించారు. ఎరువుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీ రవికి ఇండియన్ పోలీస్ మెడల్



రవి, అడిషనల్ డీసీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పరిపాలన విభాగం అదనపు డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న నల్లమల రవి ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రవి ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండ ప్రాంతానికి చెందిన అడిషనల్ డీసీపీ నల్లమల రవి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి 1991లో ఎస్సైగా ఎంపికయ్యారు. మెదక్ జిల్లాలోని శివంపేట, తుప్రాన్, మునిపల్లె పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. అనంతరం సీఐగా అమ్రాబాద్, మిర్యాలగూడ,సదాశివాపేట సర్కిల్ పీఎస్‌లలో పనిచేశారు. డీఎస్పీగా సంగారెడ్డి, జహీరాబాద్, అడిషనల్ డీసీపీ కరీంనగర్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా, అదనపు డీసీపీగా పనిచేశారు. నక్సల్ ప్రాబల్యం ఉన్న పీఎస్‌లల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా విజయవంతంగా విధులు నిర్వర్తించి అధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రవికి సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తోపాటు డీసీపీలు, అడిషనల్ డీసీపీ, ఏఎస్పీలు, అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

క్రెడిట్ కార్డుల కమీషన్ పేరుతో డబ్బులు స్వాహా..

- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ శివకుమార్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

వరంగల్ క్రైం: క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇస్తానంటూ బాధితుల నుంచి లక్షలు స్వాహా చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నేరెళ్ల అరుణ్ 2023లో హనుమకొండ రాయపురలో 'భద్రకాళి డిజిటల్ సేవ' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. ఆన్‌లైన్ అప్లికేషన్స్‌తోపాటు కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. రెగ్యులర్ కస్టమర్లను తన వాలెట్‌లో యాడ్ చేసుకుని వారి క్రెడిట్ కార్డుల్లో బ్యాలెన్స్ ఉంటే ఫోన్ చేసేవాడు. తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎలాంటి చార్జీలు లేకుండా తానే క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లిస్తానని మోసం చేసేవాడు. కార్డులు స్వైప్ చేసిన తర్వాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4 శాతం వరకు చార్జీ తీసుకుని లాభం పొందేవాడు. ఎలాంటి కమీషన్ లేకుండా డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి డబ్బులు వాడుకున్న అనంతరం కొన్ని రోజుల తర్వాత ఇతరుల క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించేవాడు. సంవత్సరంన్నర పాటు కస్టమర్లకు నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తూ, క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్ లోన్, అప్పులు కట్టుకున్నాడు. ఇలా సుమారు రూ.28 లక్షలు వాడుకున్నాడు. కొద్ది రోజులుగా విజయవాడలో ఉంటున్న నిందితుడు బుధవారం షాపు ఖాళీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- జీడికల్ Nr రామాలయం గజం కేవలం 4999/- లాంచింగ్ ఆఫర్, బుకింగ్ Rs. 108000. 1గ్రా. గోల్డ్ ఫ్రీ మార్కెటింగ్ ఏజెంట్స్ కావాలి. ఫోన్: 6302280020 [SCA25007242]

PLOT FOR SALE

- ఘట్‌కేసర్ చ॥గ॥ రూ.5700/-, భువనగిరి చ॥గ॥ రూ.3500/-, HMDA చ॥గ॥ రూ.7500/-, ఆలేరు/జనగాం చ॥గ॥ రూ.2300/- Cell: 9703650119 [HA-1327]

SERVICES

- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7416374863, HNK. [WA-7578]
- హౌస్, ఓపెన్ ప్లాట్, బిజినెస్ లోన్స్, ప్లాట్ పర్చేస్ లోన్స్, కన్‌స్ట్రక్షన్ మరియు ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. సెల్: 8096520976. [WA-6758]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198, 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	7702221602
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు

ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను ఆరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్...

నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్, కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్, కూతురు పేరు జైహింద్ జగ్యన్‌సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.


First Indian dog to paint our beloved Indian flag

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే సెంటిమెంట్స్ (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్-జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాడు అని వాళ్లు కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదేమిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి - వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి. ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమమాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం

పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ 'షోలే'. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్‌లు. సూక్తులు.

- ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అచ్ఛీ హై (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
- ముఝెతో సబ్ పోలీస్ వాలోంకీ సూరతే ఏక్ జైసీ లగ్ తీ హై (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
- తేరా క్యా హోగా కాలియా (నీ గతేంది కాలియా)
- తుమ్హారా నామ్ క్యా హై బసంతి? (నీ పేరేంటి బసంతి)
- దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కవాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్సు పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది.

ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.